

ఘనంగా కరగ ఉత్సవం



ఊరేగింపు

శిడ్లఘట్ట, మే 1: తాలూకాలోని మేలూరులో ధర్మరాయ స్వామి ద్రౌపదమ్మదేవి ఆలయ 36వ వార్షిక కరగ మహోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. మేలూరుకు చెందిన అభిలాష్ అనే వ్యక్తి పూల కరగను ధరించి ఊరేగారు. ఊరేగింపు సాగే మార్గాలలో ఇళ్లముంగిట అలికి రంగ వల్లులు వేశారు. కూడళ్లలో కరగకు పూజలు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భద్రతను గాలికొదిలేశారు..

- ఓటు బ్యాంకు కోసమే దేశద్రోహులకు వత్తాసు
- ప్రజ్వల్‌కు బీజేపీ మద్దతిచ్చే ప్రశ్నే లేదు
- నేహా హిరేమఠ్ హత్యకు బాధ్యులెవరు..?
- కాంగ్రెస్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ధ్వజం



హుబ్బళ్ళి ప్రచారసభలో అమిత్‌షాకు బీజేపీ నేతల సన్మానం

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): కేవలం ఓటుబ్యాంకు కోసం కర్ణాటక భద్రతను కాంగ్రెస్ సర్కార్ గాలికి వదిలేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా ఆరోపించారు. ధారవాడ లోక్‌సభ పరిధిలోని హుబ్బళ్ళి నెహ్రూ మైదానంలో బుధవారం బహిరంగసభలో అమిత్‌షా మాట్లాడారు. దేశ రక్షణ, భద్రతకోసం ప్రధానమంత్రి మోదీ పనిచేస్తున్నారన్నారు. అయితే దేశ వ్యతిరేకులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందన్నారు. ప్రజలు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవాలన్నారు. దేశంలో నక్సలిజం, ఉగ్రవాదం పదేళ్లలో తగ్గుముఖం పట్టిందన్నారు. కానీ కర్ణాటకలో ఇటీవల పలు సంఘటనలు ఉగ్రవాదానికి ఊతమిస్తున్నాయన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దేశంలోని అన్ని ప్రాంతాలు మోదీ మోదీ అంటూ మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. కశ్మీర్ మనది కాదా అని ప్రశ్నిస్తే ఖర్గే కశ్మీర్‌తో మనకేం సంబంధమని వ్యాఖ్యానిస్తారన్నారు. ఇక్కడి ప్రజలు కశ్మీర్ కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్టికల్ 370పైనా రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేస్తే రక్తపాతం జరుగుతుందని ఆరోపించారని ఐదేళ్లలో ఒక్క నెత్తుటిచుక్క నేల రాలేదన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని పీడిస్తున్న ఉగ్రవాదానికి ముక్తి పలికారన్నారు. మన్మోహన్‌సింగ్ పాలనవేళ అరాచకాలు పెరిగాయని, ఉగ్రవాద కార్యకలాపాలు అధికంగా ఉండేవన్నారు. మోదీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఎస్‌డీపీఐ మద్దతు కోరిందన్నారు. బెంగళూరులో కెఫెలో పేలుళ్లను ప్రస్తావించారు. జేడీఎస్‌కు చెందిన రేవణ్ణకుమారుడు రాసలీలల సీడీలో బీజేపీ మద్దతు ఉండదన్నారు. మహిళలపై దౌర్జన్యాలు చేసేవారికి బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వదన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉండేదని, విదేశాలకు పరారీ అయ్యేందుకు అవకాశం ఇవ్వాల్సి ఉండేదన్నారు. ఇలాంటివారికి కఠినశిక్షలు ఉండాల్సిందేనన్నారు. విద్యార్థిని నేహా హిరేమఠ హత్యకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇక్కడి విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ అన్నా చర్యలు ఉండవన్నారు. రామమందిరం అవసరమా అని ప్రశ్నించారని, దేశ ప్రజల కల అయోధ్యమందిరమన్నారు. కాంగ్రెస్ పాలనలో కోట్లాదిరూపాయల అవినీతి కేసులు బయటపడ్డాయని, పదేళ్ల మోదీ పాలనలో అవినీతి కనిపించిందా? అని ప్రశ్నించారు. అవినీతి నేతలకా, దేశ సంరక్షకులకు మద్దతు ఇస్తారా..? అంటూ ప్రజలను కోరారు. ప్రహ్లాద్‌జోషిని భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా మోదీకి మద్దతు ఇవ్వాలన్నారు. అంతకుముందు హావేరి జిల్లా రాణిబెన్నూరులో అమిత్‌షా రోడ్‌షో నిర్వహించారు. ధారవాడ బహిరంగ సభ ముగించుకుని హోం మంత్రి అమిత్‌షా నేరుగా విద్యార్థిని నేహా హిరేమఠ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హోం మంత్రి భరోసా ఇచ్చారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు అమిత్‌షాకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పలువురు స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.



అమిత్ షాకు వినతిపత్రం అందజేస్తున్న నేహా కుటుంబ సభ్యులు

పథకం ప్రకారమే విదేశాలకు..



- ప్రజ్వల్ గురించి అన్నీ తెలిసీ టిక్కెట్ ఎలా ఇచ్చారు?
- బీజేపీవి అన్నీ అబద్ధాలే
- పారదర్శకంగా దర్యాప్తు.. ఎవరినీ వదిలేదీ లేదు : సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజ్వల్ రాసలీలల వివాదం రాజకీయంగా రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. కీలకనేతలు పరస్పర ఆరోపణలతో వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటికే జేడీఎస్ నేత కుమారస్వామి, డీసీఎం డీకే శివకుమార్‌లు పరస్పరం విమర్శలు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా యాదగిరిలో సీఎం సిద్దరామయ్య గురువారం ఎన్నికల ప్రచారవేళ మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ రేవణ్ణను పథకం ప్రకారమే విదేశాలకు పంపారని మాజీ ప్రధాని దేవెగౌడ ఆరోపించారు. విదేశాలకు వెళ్లేందుకు వీసాలు ఇచ్చేది కేంద్రప్రభుత్వమే అన్నారు. పెన్‌డ్రైవ్‌లు బహిరంగం చేయడంలో డీకే శివకుమార్ పాత్ర ఉందని కుమారస్వామి ఆరోపణలు అవాస్తవమని సీఎం కొట్టిపారేశారు. రేవణ్ణ, ప్రజ్వల్ వద్ద డ్రైవర్‌గా కొనసాగిన కార్తీక్ పెన్‌డ్రైవ్‌లు బహిరంగం చేసినట్లు చెప్పుకుంటున్నారన్నారు. కేవలం కుమారస్వామి రాజకీయాల కోసమే డీకే శివకుమార్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు సమాచారం తెలిసినా ఎందుకు ప్రజ్వల్‌కు ఎంపీ టిక్కెట్ ఇచ్చారన్నారు. వివాదం బయటకు రాగానే 'సిట్' విచారణకు ఆదేశించామన్నారు. పారదర్శకంగా దర్యాప్తు సాగుతుందని ఎవరినీ వెనకేసుకొచ్చేది ఉండదన్నారు. కాగా హాసన్‌లో సిట్‌బృందం దర్యాప్తును ప్రారంభించింది. ప్రజ్వల్ రేవణ్ణ నివాసంతోపాటు ఫాంహౌస్‌లోనూ పరిశీలింపదలిచారు. బాధిత మహిళల్లో పదిమందికి విచారణకు రావాలని సూచించగా ఐదుగురు వచ్చినట్లు సమాచారం. కేసు విచారణకు మాజీ మంత్రి రేవణ్ణ ఈనెల 4న విచారణకు హాజరవుతానని ప్రకటించారు. ప్రజ్వల్ రాసలీలల వీడియో కేసులో 354 ఏ, 354 డీ సెక్షన్‌లకింద కేసు నమోదు చేశారని ఇవి విచారణకు మాత్రమే పరిమితం అవుతాయని అరెస్టు చేసేందుకు అవకాశం ఉండదని, తదుపరి సెక్షన్‌లు చేరిస్తేనే అరెస్టు చేసేందుకు వీలుంటుందని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఈనెల 3న ప్రజ్వల్ బెంగళూరుకు వెనుతిరిగి వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతున్నా న్యాయవాదుల ద్వారా ఏడు రోజుల గడువు కోరడం ట్విస్ట్‌గా మారింది. కొన్ని రోజుల తర్వాత అన్నీ సర్దుకుంటాయని రేవణ్ణ వ్యాఖ్యానించడం మరో మలుపునకు కారణమవుతోంది. అయితే ప్రజ్వల్ వివాదం కూటమి నేతలకు నిద్ర లేకుండా చేస్తోంది

- హాసన్‌కు చెందిన న్యాయవాది దేవరాజ్‌గౌడ నాలుగు నెలలక్రితమే కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన అంశం చర్చకు కారణమవుతోంది. డిసెంబరు 7న దేవరాజ్‌గౌడ లేఖ రాసినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్‌కు టిక్కెట్ ఇస్తే కాంగ్రెస్ దుర్వినియోగం చేసుకోనుందని లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. సూరజ్ రేవణ్ణపై కిడ్నాప్‌తోపాటు పలు కేసులు ఉన్నాయని ప్రజ్వల్ మహిళలతో లైంగికక్రియల్లో పాల్గొన్న అనేక వీడియోలు ఉన్నాయని ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

నగరం గరంగరం

బెంగళూరులో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత





- ఉద్యాననగరిలో మండిపోతున్న ఎండలు
- రాష్ట్రవ్యాప్తంగా అదే తీరు..
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- 18 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): గార్డెన్‌సిటీగా పేరొంది, వేసవిలోనూ చల్లదనంతో ఆహ్లాదం పంచిన బెంగళూరు నగరం మండుటెండలతో మంటలు రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఎండలు మండుతుండడంతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. బుధవారం నగరవ్యాప్తంగా 41 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కెంగేరిలో అత్యధికంగా 41.8 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా కొనసాగింది. అత్యధికంగా కలబురగిలో 42.8 డిగ్రీలు నమోదు కాగా బెంగళూరు బిదరహళ్ళిల41.3 డిగ్రీలుగా ఉంది. బెంగళూరులో వారం రోజులుగా 36 - 39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత కొనసాగింది. కానీ ఒక్కసారిగా బుధవారం 40 డిగ్రీలు దాటింది. మే నెల ప్రారంభంలో భానుడు మరింత మండిపడ్డాడు. నగరంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రత వివరాలిలా. బెంగళూరు యూనివర్సిటీ - 40.1, లాల్‌బాగ్ 40.5, యలహంక - 40.8, తావరకెరె 40.3గా ఉంది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా బీదర్, కలబురగి, యాదగిరి, రాయచూరు, బాగల్కోటె, బెళగావి, విజయపుర, గదగ్, ధారవాడ, హావేరి, కొప్పళ, విజయనగర, దావణగెరె, చిత్రదుర్గ, తుమకూరు, కోలారు, మండ్య, బెంగళూరు గ్రామీణ, రామనగర, మైసూరు, చిక్కమగళూరు, చిక్కబళ్ళాపురలలో మరో ఐదు రోజులు వేడిగాలులు వీస్తాయని వాతావరణ పరిశోధనశాఖ అధికారులు ప్రకటించారు. 18 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో హీట్‌స్ట్రోక్ ప్రమాదం ఉంటుందని ఎండలో బయట తిరగరాదని హెచ్చరించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయట తిరగరాదని, ద్విచక్రవాహనంలో ప్రయాణించేవారు ముఖానికి మాస్క్ వేసుకోవాలని, ఎండలో పనిచేసేవారు కనీసం 3-4గంటలు విశ్రాంతి తీసుకోవాలని, వెంట తప్పనిసరిగా నీళ్ల బాటిల్ కలిగి ఉండాలని సూచిస్తున్నారు. శీతలపానీయాలు తీసుకోవాలని, కాఫీ, టీలకు దూరంగా ఉండడం సముచితమని సూచించారు. బీపీ, షుగర్ బాధితులు మరిన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా మంగళవారం బాగల్కోటె జిల్లా కరడిలో 45.3 డిగ్రీలు, రాయచూరు జిల్లా గిల్లెసోగూరులో 45.2 డిగ్రీలు, యాదగిరి జిల్లా గోగిలో 45.1, విజయపుర జిల్లా నాలతవాడలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు ప్రకటించారు.



కుప్పకూలిన ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఉమేశ్‌జాదవ్

సొమ్మసిల్లిన జాదవ్

- ఎన్నికల ప్రచారంలో కలబురగి బీజేపీ అభ్యర్థి ఉమేశ్ జాధవ్ సొమ్మసిల్లారు. హుటాహుటిన ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బుధవారం ఎన్నికల ప్రచారం చేస్తుండగానే అస్వస్థతకు లోనయ్యారు. తోటి కార్యకర్తలతో మాట్లాడుతూనే వేదికపై కుప్పకూలారు. ఆసుపత్రికి తరలించగా ఎండవేడిమి తోపాటు లో బీపీ కారణంగానే అస్వస్థతకు లోనైనట్టు వైద్యులు తెలిపారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి నాయకులు బెంబేలెత్తుతున్నారు.



254 పీఎంశ్రీ పాఠశాలలకు అనుమతి

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలు చేసే ఉద్దేశంతో ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇన్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ - పీఎం శ్రీ) పథకం ద్వారా రాష్ట్రానికి 254 పాఠశాలలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో 2022-23 విద్యా సంవత్సరంలో తొలిసారి 129 పాఠశాలలను అభివృద్ధి చేశారు. కొత్తగా 254 పాఠశాలకు అనుమతి ఇచ్చారు. దీంతో 383 పాఠశాలలు అభివృద్ధి కానున్నాయి. రాష్ట్రంలో రానున్న విద్యాసంవత్సరం 507 పాఠశాలల అభివృద్ధికోసం ప్రాథమిక విద్యాశాఖ కేంద్రవిద్యాశాఖకు అనుమతులు కోరింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పీఎంశ్రీ పథకం కీలక సభలో రాష్ట్రానికి 254 పాఠశాలలకు అనుమతులు ఇచ్చారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, బహుభాషా బోధనలు, భిన్నమైన శిక్షణా సామర్థ్యం పెంచడం, విద్యార్థుల్లో నైపుణ్యత పెంచడం, షెడ్యూల్ ప్రకారం అన్ని ప్రక్రియలు కొనసాగించడం పలు ఉద్దేశాలతో పీఎం శ్రీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. పాఠశాల దశలోనే పారదర్శకత, నైపుణ్యత విద్యార్థులలో పెంచడమే పీఎంశ్రీ ప్రధాన ఉద్దేశం. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక పబ్లిక్ స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తోంది. అదే తరహాలో పీఎంశ్రీ పాఠశాలలను ప్రాథమిక విద్యనుంచి పీయూ ద్వితీయ వరకు ఒకేచోట విద్య అందించడం కీలకం. తొలి విడతలో 129 పాఠశాలల అభివృద్ధికి రూ.12.57 కోట్లు విడుదల చేశారు. మౌలిక సదుపాయాలు, విద్యకు సంబంధించిన కార్యకలాపాలకు అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్ ఇతరత్రా కొనుగోలు చేశారు. దేశవ్యాప్తంగా 6,448 పాఠశాలలను పీఎంశ్రీ కింద మంజూరు చేయగా కర్ణాటకకు 254 పాఠశాలలకు అనుమతి ఇచ్చారు. ఇదే విషయమై విద్యాశాఖ డైరెక్టర్ రమేశ్ అభిప్రాయం మేరకు విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పీఎంశ్రీ పథకం అమలులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపిక చేసిన పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు.

తెలుగు విజ్ఞాన సమితి మాజీ అధ్యక్షుడు

జేఎస్ రెడ్డి కన్నుమూత



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్



జేఎస్ రెడ్డి (ఫైల్)

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రుడు, వ్యాపారవేత్త జక్కా శ్రీనివాస రెడ్డి (జేఎస్ రెడ్డి) (80) కన్నుమూశారు. ఇటీవల కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఇందిరానగర్‌లోని నివాసంలో తుదిశ్వాస వీడారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడిగా సేవలందించి విద్యా ట్రస్టులో కీలక ట్రస్టీగా ఆయన కొనసాగారు. బెంగళూరులో నాలుగు దశాబ్దాలపాటు తెలుగు భాష, సంస్కృతి కోసం ఆయన నిరంతరంగా కృషి చేశారు. జేఎస్ రెడ్డి కన్నుమూశారన్న సమాచారం తెలియగానే ప్రవాసాంధ్రులు, తెలుగు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. జేఎస్ రెడ్డి మృతి పట్ల తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ తెలుగు భాష, తెలుగు ప్రజల కోసం ఆయన దశాబ్దాలకాలంగా సేవ చేశారన్నారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు. శాసనసభ మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ జక్కా శ్రీనివాసరెడ్డి పుట్టింది జగదేవరపల్లిలో, పెరిగింది నెల్లూరులో కాగా స్థిరపడింది బెంగళూరులో అన్నారు. ప్రవాసాంధ్రులకు ఆయన పెద్దన్నగా వ్యవహరించారన్నారు. పారిశ్రామికవేత్తగా ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించారన్నారు. ఆయన అకాల మరణం బాధ కలిగించిందన్నారు. ఇందిరానగర్‌లోని నివాసానికి తెలుగు విజ్ఞాన సమితి ఉపాధ్యక్షులు గంగరాజు, ఆదికేశవులునాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సీవీ రామన్‌నగర్ ఎమ్మెల్యే ఎస్ రఘు, ఎమ్మెల్యే కొత్తనూరు మంజునాథ్‌తోపాటు పెద్ద ఎత్తున బంధుమిత్రులు పాల్గొన్నారు. జేఎస్ రెడ్డి అంత్యక్రియలు గురువారం ఉదయం 10 గంటలకు కల్పల్లి స్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబీకులు వెల్లడించారు.



కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సాయం అందలేదు. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్లతో ఆశించిన దిగుబడి

ప్రభుత్వ సాయం అందలేదు..

రావడం లేదు. ఈ ఏడాది మిరప సాగు చేసి గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు.

- బొమ్మన్న, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు

ఎందుకు ఇలా చేశారు..?

కౌలు రైతుల ఆవేదన

కళ్యాణదుర్గం, మే 1: 'కౌలు రైతులను ఆదుకుంటాం. వారికి అండగా నిలుస్తాం. గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తాం' అని ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఓట్లే వేయించుకుని, అధికారంలోకి వచ్చాక వారిని ఏ మాత్రం పట్టించుకోలేదు. వారి కష్టాన్ని గుర్తించలేదు. కొందరికి సీసీఆర్‌సీ కార్డులు అందలేదు. మరికొందరికి పంట సాగుదారు హక్కు పత్రాలు ఇచ్చినా ఏ మాత్రం ప్రయోజనం చేకూరలేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ఎకరాకు సుమారు రూ. 17 వేలు నుంచి రూ. 24 వేలు వరకు కౌలు చెల్లిస్తున్నారు. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి సాగు చేస్తున్నారు. తీవ్ర వర్షాభావం, తెగుళ్ల కారణంగా పెట్టుబడులు దక్కక, ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



అందని వడ్డీలేని రుణాలు

కౌలు రైతులకు పంటల బీమా వర్తింపజేస్తామని, వడ్డీలేని రుణాలు ఇస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. బ్యాంకులకు వెళితే భూయజమానులకే రుణాలిచ్చేశామని, మళ్లీ మీకు రుణాలు ఇవ్వలేమని చేతులెత్తేశారు. పెట్టుబడులు పెరిగాయి. ఇటు పంటలు చేతికందక అటు ప్రభుత్వ సాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- రవి, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు



ఐదేళ్లుగా కౌలు రైతుల కష్టాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పెట్టుబడులు పెరిగినా పండించిన ధాన్యానికి

సంక్షేమాన్ని మరిచారు

గిట్టుబాటు ధర లభించడం లేదు. తుఫానుతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందలేదు. భూసార పరీక్షల ఊసేలేదు.

- శ్రీనివాసులు, జల్లిపల్లి, కంబదూరు

భారత ఎన్నికల సంఘానికి 74 సంవత్సరాలు

భారత ఎన్నికల సంఘం ఏర్పడి 74 సంవత్సరాలు గడుస్తోంది. భారత ఎన్నికల సంఘం ఓ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. ఎన్నిలకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకుంటుంది. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. దేశ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏక కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు 50లక్షల మంది ఉద్యోగుల సేవలను ఎన్నికల సంఘం వినియోగించుకుంటుంది. ఎన్నికల సంఘం ఏర్పాటు అయ్యాక మొదటి సాధారణ ఎన్నికలను హిమాచల్ ప్రదేశ్‌లోని చిని నియోజకవర్గంలో నిర్వహిం చారు. సీనియర్ ఐఏఎస్ అధికారులను ఎన్నికల సంఘం కమిషనర్లుగా రాష్ట్రపతి నియమిస్తారు. ఎన్నికల సంఘానికి పలు అనుబంధ విభాగాలుంటాయి. మొదటి భారత ఎన్నికల సంఘం కమిషనర్‌గా సుకుమార్‌సేన్ నియమితుల య్యారు. అయితే ప్రతి రాష్ట్రానికి కూడా ఒక ఎన్నికల సంఘం ఉంటుంది. ఆసంఘాలన్ని భారత ఎన్నికల సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తుంటారు. రెండింటి మధ్య పని విభజన, సమన్వయం, తదితరాంశాలపై పారదర్శకత ఉంటుంది.

- కదిరి అర్బన్



అంతా సర్వేలమయం

గోప్యంగా సమాచార సేకరణ...

అభ్యర్థులకు నివేదికలు ఇస్తున్న సర్వే బృందాలు

హిందూపురం, మే1 : సార్వత్రిక ఎన్నికల్లో విజయతీరాలు చేరేందుకు సర్వేలు కీలకమయ్యాయి. వివిధ సంస్థలతోపాటు అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్న సొంత సర్వే ఏజెన్సీలు నియోజకవర్గాల వారిగా ఓటర్ల మనస్తత్వం తెలుసుకునేందుకు జల్లెడు పడుతున్నాయి. సర్వేల ఆధారంగా ఆయా మండలాల్లో అనుకూలత, ప్రతికూలతపై సర్వే సంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు నివేదిక ఇస్తున్నారు. ఈ నివేదిక ద్వారా ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే చక్కబెట్టుకునే అవకాశం చిక్కుతుంది. ఈ సర్వే వ్యవహారమంతా గోప్యంగా సాగుతోంది. ఎక్కడ పది మంది గుమిగూడి ఉంటారో వారి వద్ద చర్చలు జరుపుతారు. వారి నుంచి సమాచారం రాబట్టి ఆ మేరకు నివేదికను రూపొందిస్తారు. వృద్ధులు, యువకులు, మహిళలు కొత్తగా ఓటర్లయిన యువత, నిరుద్యోగుల నుంచి అనుకూల, ప్రతికూల అంశాలపై ఆరాతీస్తున్నారు. సర్వేల ద్వారా ప్రత్యర్థుల వ్యూహాలు కూడా తెలుస్తుంటాయి. రాజకీయాలకు సంబంధంలేని సమీప బంధుమిత్రులతో కూడా కొత్త విషయాలు తెలుసుకుని అభ్యర్థులకు వినిపిస్తున్నారు. సర్వేల ద్వారా అభ్యర్థులు తమ విజయానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆయా పార్టీలు ఈసారి ఎక్కువ భాగం సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటించాయి. అధికార పార్టీ తాము చేసిన పనులు, ప్రస్తుత పరిస్థితులు, అనుకూల, ప్రతికూలతలను ఆరాతీస్తున్నట్లు సమాచారం. ప్రతికూల అంశాల వివరాలను సేకరించేందుకు సర్వేలో ముమ్మరం చేశాయి.



చేరికలు, అలకలపై దృష్టి

సర్వే బృందాలు ఓటర్లనాడి తెలుసుకోవడమేకాక ప్రస్తుత ఎన్నికల్లో పార్టీల బలాలు, బలహీనతలను గుర్తిస్తున్నాయి. సర్వే బృందం పనిచేసే పార్టీ ఎక్కడైనా బలహీనంగా ఉంటే అక్కడ ప్రత్యర్థి పార్టీ నుంచి ఎవరైనా నాయకులు వస్తారా..? వస్తే ఎంతమేర మేలు చేకూరుతుంది.. వారికి ఆర్థిక వనరులు, భవిష్యత్తులో పార్టీ నుంచి వారికి ఏవిధంగా ఉపయోగం ఉంటుందో సర్వేబృందాలు వివరిస్తూ మధ్యవర్తులుగా కూడా వ్యవహరిస్తున్నాయి. అధికార పార్టీకి సర్వే చేస్తున్న బృందాల ప్రతినిధులు వీటిపై ఎక్కువగా దృష్టి పెట్టారు. మరీ ముఖ్యంగా పార్టీలో అలిగినవారి వివరాలు ఆరాతీసి వారు ఎందుకు మౌనంగా ఉన్నారో సన్నిహితుల ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు అభ్యర్థులకు చేరవేస్తున్నారు.

గంట వ్యవధిలో అటూ .. ఇటూ...

రాప్తాడు, మే 1: మండలకేంద్రానికి చెందిన పెద్దన్నను బుధవారం ఉదయం తోపుదుర్తి నయనతారెడ్డి బలవంతంగా వైసీపీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. బలవంతంగా పార్టీలోకి చేర్చుకోవడం నచ్చని పెద్దన్న గంట తరువాత టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, శివ పాల్గొన్నారు.



ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన పెద్దన్న



బూదగవి వద్ద చీకలగుర్కి గ్రామానికి వెళ్లే దారిలో శిథిలమైన బ్రిడ్జి

అన్నీ గాలి మాటలే..!

పనులు చేశాకే ఓట్లు అడుగుతామన్న వైసీపీ నాయకులు

ఐదేళ్లలో గ్రామాల వైపు తిరిగి చూడని వైనం

ఇప్పుడు మళ్లీ ఓట్లు అడుగుతుండటంపై ప్రజల ఆగ్రహం

విడపనకల్లు, మే 1: మండలంలోని చీకలగుర్కి గ్రామానికి వెళ్లే రహదారి పనులు చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన తరువాతనే ప్రజలను ఓట్లు అడుగుతామని వైసీపీ నేత విశ్వేశ్వరరెడ్డి గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కాని రోడ్డుపై ఒక్క గంప కంకరవేయలేదు, ఒక్క గంప ఇసుక వేయలేదు. చీకలగుర్కి గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, రోడ్డు వేస్తామన్న నాయకుడు ఆపనులు చేయకుండానే, మళ్లీ తనకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంపై ఆ ఊరి ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

- పెద్ద కొట్టాలపల్లి చీకలగురికి, మాళాపురం, బూదగవి, వెలిగొండ, కరకముక్కల గ్రామాలకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగు నీరు అందించి దాదాపుగా 20వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్న వైసీపీ నాయకు లు కాలువ పనులు చేయకుండా ఐదేళ్లు గడిపేశారు. టీడీపీ పాలనలో కొట్టాలపల్లి వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు ప్రభుత్వం మారటంతో ఆ పనులు ఆగిపోయాయి. పొలాల్లో తవ్విన కాలువల్లో ముళ్ల పొదలు పెరిగి పోయి, కాలువలు పూడి పోతున్నాయి. కనీసం ఒక్క ఎకరానికికూడా సాగు నీరు అందివ్వలేదు.
- గడేకల్లు గ్రామంలో జాతీయ రాహదారి పనులు నిలిపివేసి ఆరు సంవత్సరాలు అయింది. గ్రామస్థులు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. మాటలు చెప్పి ఓటర్లను నిలువునా మోసం చేయటం వైసీపీ నైజంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- విడపనకల్లు మండలంలో ప్రధాన సాగునీటి వనరు జీబీసీ. దీని కింద వేల ఎకరాల్లో మిర్చి పంటలు సాగు చేస్తుంటారు. కానీ జీబీసీకి కూడా పూర్తి స్థాయిలో సాగు నీరు అందివ్వక పోవటంతో మిర్చి రైతులు వందల కోట్ల రూపాయలు పంటలు నష్ట పోయారు.

రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం తర్వాతే ఓట్లు అడుగుతామన్నారు



చీకలగుర్కి గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మించిన తరువాతనే ఓట్లు అడుగుతామన్నారు. కానీ ఆ హామీ నేటికీ నెరవేరలేదు. మా గ్రామానికి రోడ్డు లేక రావాలంటేనే ఇబ్బందిగా ఉంది. బ్రిడ్జిలు కూలి పోయాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. ఇచ్చిన మాట నెరవేర్చకున్నా మళ్లీ ఓట్లు అడిగేందుకు గ్రామానికి రావడం దారుణం.

- పద్మావతి, చీకలగుర్కి సర్పంచ్

ఇచ్చిన మాట మరిచిపోయారు



మా పొలంలోనే హంద్రీనీవా కాలువను తవ్వారు. సాగు నీరు వస్తే పంటలకు నీటి తడులు అందించి అప్పుల బాధ నుంచి బయట పడాలి అనుకుంటే వైసీపీ నాయకులు హంద్రీనీవాకు చుక్కనీరు ఇవ్వలేక పోయారు. పనులు చేసి ఉంటే కాలువకు సాగు నీరు వచ్చేది. బిందెలతో నీటిని పోసి మిరప పంటలను కాపాడుకున్నాము. హంద్రీనీవాకు సాగు నీరు అందించిన తరువాతనే ఓట్లు అడుగుతామన్న వైసీపీ నాయకులు ఆ మాటను మరిచిపోయారు.

- బొజ్జప్ప, రైతు, చీకలగుర్కి



చీకలగుర్కి పొలాల్లో పిల్లకాలువను తవ్వి వదిలేసిన దృశ్యం

ఐదేళ్లు గడిచినా రోడ్డు పనులు చేపట్టలేదు



గడేకల్లులో జాతీయ రహదారి పనులు నిలిపివేసి ఆరేళ్లవుతోంది. ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నో సార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అధికార పార్టీ నాయకుల్లో చలనం రాలేదు. గత ఐదు సంవత్సరాలు రోడ్డును పట్టించుకోలేదు. దుమ్మూ, ధూళికి ప్రజలు రోగాల పాలవుతున్నా రు. రోడ్లు వేయిస్తామన్న నాయకులు ఐదేళ్లలో ఒక్కరు కూడా ఇటు వైపు తిరిగి చూడలేదు. ఇప్పుడు మాత్రం మేం అభివృద్ధి చేశాం. మాకు ఓటు వేయండి అంటూ వైసీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నారు.

- చక్రవర్తి, గడేకల్లు



చీకలగుర్కి గ్రామం వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి



మూతపడ్డ అనంతపురం డెయిరీ





పాడుబడిన నీటినిల్వ తొట్టెలు



అనంతపురం డెయిరీ ముఖద్వారం

అట్లుంది... జగన్ పాలన..!

టీడీపీ ప్రభుత్వంలో పాలవెల్లువ

రోజుకు లక్షల లీటర్ల పాలను సేకరించిన అనంతపురం డెయిరీ

ఆర్థిక సాధికారతను సాధించిన పాడి రైతులు

జగన్ రాగానే డెయిరీ మూత

'పాడి'రైతుల పొట్టకొట్టిన ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్, మే 1: రైతులకు వ్యయసాయంతోపాటు పాడి అదనపు ఆదాయ వనరు. చాలామంది రైతులు అనంతపురం డెయిరీకి పాలు పోసి ప్రతివారం బిల్లులు పొందేవారు. తద్వారా పిల్లల చదవులు, ఇంటి అవసరాలను పాల డబ్బులతో తీర్చుకునేవారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాలవెల్లువ పొంగిపొర్లిందని పాడిరైతులు గుర్తుచేసుకుంటున్నారు. ఒక్క చాన్స్ ఇవ్వండని బతిమాలిన జగన్‌కు ఓటేసి గెలిపిస్తే.. ఏకంగా డెయిరీనే మూతవేయించారని రైతులు మండిపడుతున్నారు. పాడిరైతుల కష్టాన్ని కార్పొరేట్‌కు అమ్ముకుని కోట్లు కొల్లగొట్టేందుకు అమూల్ సంస్థను తీసుకువచ్చిన జగన్.. తమ కడుపులు కొట్టారని వాపోతున్నారు. మరోసారి జగన్ అధికారంలోకి వస్తే డెయిరీ ఆస్తులను అమ్ముకుని జేబు నింపుకోవడం ఖాయమని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

32 బీఎంసీయూల ఏర్పాటు...

ఉమ్మడి జిల్లాలో 63 మండలాల వ్యాప్తంగా 32 బీఎంసీయూ (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్)లను ఏర్పాటు చేశారు. యూనిట్ల పరిధిలోని గ్రామాల్లో పాడిరైతుల ద్వారా సేకరించిన పాలను ఎప్పటికప్పుడు బీఎంసీయూలకు తరలించి కూలింగ్ చేసేవారు. అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా డెయిరీ ప్లాంట్‌కు రవాణాచేసేవారు. ప్రాసెస్‌ను పూర్తిచేసిన అనంతరం పాల ప్యాకెట్లను తయారుచేసి మార్కెట్‌కు తరలించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డెయిరీతోపాటు బీఎంసీయూలు మూతపడ్డాయి. దీంతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా తమ కష్టార్జితంతో పోగుచేసిన రూ.కోట్ల విలువచేసే బీఎంసీయూ, డెయిరీ ప్లాంట్ యంత్రాలు, పరికరాలు తుప్పుపట్టాయని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ తన సామాజిక వర్గానికి చెందిన కొందరి వ్యక్తులకు పాల వ్యాపారంలో అడ్డుకాకూడదనే దురుద్దేశంతోనే డెయిరీని మూతయించారని రైతులు మండిపడుతున్నారు

పేదలకు మేని ఫెస్ట్

కూటమి మేనిఫెస్టోపై పలువురి హర్షం

వైసీపీ పాలనతో విసిగి పోయిన ప్రజలు నూతన ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలోనే రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ తమ కూటమి అధికారంలోకి వస్తే చేయబోయే పనుల గురించి హామీ ఇస్తూ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో పట్ల జనం నుంచి సానుకూలత వ్యక్తం అవుతోంది.

- అనంతపురం సెంట్రల్

బస్సులో ఉచితంగా పోవచ్చు



నా బిడ్డకి బాగలేకుంటే పెద్దాసుపత్రికి వచ్చినాం. మా ఊరినుంచి అనంతపురం రావడానికి బస్సులో రూ.200 టికెట్ తీసుకున్నారు. తిరిగి పోవాలంటే మళ్లీ రూ.200 టికెట్‌కి పెట్టాలి. మాలాంటి పేద వాళ్లు ఈ చార్జీలు భరించలేము. చంద్రబాబు సీఎం అయినాక ఆడోళ్లందరూ ఉచితంగా బస్సుల్లో పోవచ్చంట కదా! మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామంటున్నారు. పింఛన్ రూ.4వేలకు పెంచుతామన్నారు. ఇవన్నీ వస్తే మాలాంటోళ్లకు మంచి జరుగుతుంది.

- వన్నూరమ్మ, యర్రగుంట

పిల్లలను బాగా చదివించవచ్చు..



అమ్మ ఒడి ఇస్తున్నామని చెబుతున్న మాటలన్నీ అబద్ధమే. నాకు ఇద్దరు పిల్లలుంటే ఒక్కరికి కూడా అమ్మఒడి రాలేదు. వలంటీర్‌ని అడిగి అడిగి సాలైపోయింది. ఎన్ని సార్లు సచివాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. కూలి పనులకెళ్లి చదివించుకుంటున్నాం. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చినాక ఇంట్లో ఎంత మంది ఉన్నా ఒక్కక్కరికి రూ.15వేలు ఇస్తారంట. దీంతో పిల్లలను బాగా చదివించవచ్చు. ఈ పథకం తొందరగా రావాలని మాలాంటి పేదవాళ్లందరూ ఎదురుచూస్తున్నారు.

- భాగ్యమ్మ, గులుగుండపల్లి

కార్మికులు బాగుపడుతారు



పెరిగిన ధరలతో నెల గడవాలంటే కనీసం రూ.30వేలు కావాలి. పనిదొరికితేగాని కూలిరాని మాలాంటి కార్మికులు చాలా ఇబ్బందులు పడు తున్నాము. గతంలో పనిముట్లు ఇచ్చేవారు. పిల్లల చదువులు, పెళ్లిలకు ఆర్థిక సాయమందించారు. స్వయం ఉపాధికి ఆర్థికసాయం, మహిళలకు నెలకు రూ.1500, కరెంట్ చార్జీల తగ్గింపు, పనిముట్ల అందజేత తదితర పథకాలు అమలుచేస్తామని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కొత్త మేనిఫెస్టోను విడుదల చేశారు. వీళ్ల ప్రభుత్వం వచ్చి ఈ పథకాలు అమలైతే కార్మికులు బాగుపడుతారు.

- ఖాసీం, వడ్రంగి కార్మికుడు

రుణాలు, రాయితీల్లేవు..



మాలాంటి చిరువ్యాపారులు పెట్టుబడి పెట్టేందుకు రుణాలు, రాయితీలు ఇవ్వడంలేదు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి ఈ రెండు చాలా అవసరం. పన్నులు, అద్దెలు, కరెంట్ బిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ ఇలా ఖర్చులన్నీ తడిసి మోపెడవుతున్నాయి. స్వయం ఉపాధి కింద చిరువ్యాపారులను పోత్సహిస్తామని, కార్పొరేషన్‌ల ఏర్పాటు, సబ్‌ప్లాన్‌కు నిధులు వంటి ఎన్‌డీఏ కమిటీ మేనిఫెస్టో అమలు కావాల్సిన అవసరముంది.

- అజయ్, చిరువ్యాపారి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయజ్...

పి. పుల్లయ్య (జయంతి)



తెలుగు సినీరంగంలో పేరొందిన సినీ దర్శకుడు, నిర్మాత పీ పుల్లయ్యగా పేరొందిన పోలు దాసు పుల్లయ్య 1911 మే 2న నెల్లూరులో జన్మించారు. 'పద్మశ్రీ పిక్చర్స్' పతాకంపై అర్ధాంగి, జయభేరి వంటి సిని మాలు ఎంతో పేరొందాయి. 'అర్ధాంగి' సినిమాకు బెస్ట్ ఫిల్మ్‌ఫేర్ అవార్డు దక్కింది. 'సిరి సంపదలు', 1960లో ఎన్టీఆర్ నటించిన 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం' సినిమాలు ఉత్తమ సినిమాగా నిలిచాయి. కాగా నటి పి శాంత కుమారిని పెళ్ళి చేసుకున్నారు. 1950-80ల మధ్య ఎన్నో హిట్ సినిమాలు తీశారు. రఘుపతి వెంకయ్య అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 1985 మే 29న కన్నుమూశారు.

సత్యజిత్ రే (జయంతి)



'భారతరత్న' అందుకున్న తొలి సినీరంగ ప్రముఖుడు సత్యజిత్ రే 1921 మే 2న కోల్కత్తాలో జన్మించారు. 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకరిగా పేరొందారు. సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తం 37 చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తొలి సినిమా 'పథేర్ పాంచాలీ' కేన్స్ చలన చిత్రోత్సవంలో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. దర్శకత్వం సహా సినీ రంగంలోని ఇతర విభాగాలపై అవగాహన కలిగారు. 1992లో 'గౌరవ ఆస్కార్ పురస్కారం' అందుకున్న తొలి భారతీయుడు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఇతరత్రా పొందారు. 1992 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

మాయా రావ్ (జయంతి)



కథక్ నృత్యకారిణి మాయా రావ్ 1928 మే 2న బెంగళూరులో జన్మించారు. ఒడిశ్శాకు చెందిన కథక్ నృత్యాన్ని కర్ణాటకలోనూ, దక్షిణాదిన విస్తృతం చేశారు. శంభు మహారాజ్ వద్ద శిక్షణ పొందారు. హిందూస్థానీ సంగీతంలోనూ తర్ఫీదు పొందారు. నాట్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కథక్ అండ్ కొరియోగ్రఫీని బెంగళూరులో 1987లో ఏర్పాటు చేయగా 3వేలమందికిపైగా శిక్షణ పొందారు. కర్ణాటక సంగీత్ నృత్య అకాడమీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించి జాతీయస్థాయి ఆర్ట్ ఫెస్టివల్స్ నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ, రాజ్యోత్సవ, శాంతలా అవార్డు తదితరులు పాల్గొన్నారు. 2014 సెప్టెంబరు 1న కన్నుమూశారు.

సౌమ్య స్వామినాథన్ (పుట్టినరోజు)



సౌమ్య స్వామినాథన్ యాదవ్ 1959 మే 2న చెన్నైలో జన్మించారు. హరిత విప్లవ పితామహగా పేరొందిన ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె. చిన్నపిల్లల వైద్యురాలిగా, క్లినికల్ సైంటిస్ట్‌గా రాణించారు. పక్షవాతం, హెచ్ఐవీలపై పలు పరిశోధనలు చేశారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా కొనసాగుతున్నారు. 2017 నుంచి 2022 వరకు డబ్ల్యుహెచ్ఓలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రోగ్రామ్స్‌గా వ్యవహరించారు. ఆస్ట్రాజెనికా రీసెర్చ్ ఎండోమెంట్ అవార్డు, పలు గౌరవ పురస్కారాలు అందుకున్నారు.

బ్రియాన్ లారా (పుట్టినరోజు)



వెస్టిండీస్ దేశానికి చెందిన క్రికెట్ మాజీ కెప్టెన్ బ్రియాన్ లారా 1969 మే 2న జన్మించారు. క్రికెట్ చరిత్రలోనే ప్రముఖ ఆటగాళ్లలో ఒకరుగా పేరొందారు. పలు టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో టాప్‌ర్యాంక్ సాధించారు. ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా గౌరవ సభ్యుడిగా గుర్తింపు పొందారు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించడమే కాకుండా టెస్ట్ ఇన్నింగ్స్‌లోనూ అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించి ప్రపంచరికార్డు సొంతం చేసుకున్నారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 501 పరుగులు సాధించి రికార్డు నెలకొల్పారు. బీబీసీ స్పోర్ట్స్ పర్సనాలిటీ అవార్డు, విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ ఇతర అవార్డులు అందుకున్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక సేవలందిస్తున్నారు.

అదుపు తప్పిన టెంపో



చెల్లాచెదురైన టామోటాను బాక్సులలోకి వేస్తూ...

శిడ్లఘట్ట, మే 1: తాలూకాలోని బొమ్మనహళ్ళి గేట్ వద్ద టమోటా బాక్సుల లోడుతో వస్తున్న మినీ టెంపో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. చింతామణి నుంచి టమోటా కొనుగోలు చేసి హావేరికి బయల్దేరిన మహీంద్ర మినీ టెంపో బుధవారం ఉదయం ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో టమోటా బాక్సులన్నీ చెల్లాచెదురై పడ్డాయి. ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. టమోటా బాక్సులు కిందపడ్డంతో ప్రధాన రహదారిపై కొంతసేపు అంతరాయం నెలకొంది. ఇతర వాహనదారులు సాయం అందించడంతో పరిస్థితి చక్కబడింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుత్తి, మే 1: అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో లారీ కింద పడి మతిస్థిమితం లేని కురువ శివన్న (26)అనే వ్యక్తి మృతిచెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కురువ శివన్న మతిస్థిమితం లేక రైల్లో దిగి వచ్చి ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తొలిసారి ఇద్దరూ మహిళలే..

● దావణగెరెలో శామనూరు, భీమనూరు కుటుంబాల మధ్య పోటీ ● కాంగ్రెస్, బీజేపీలకూ తప్పని రెబెల్స్ బెడద

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఓ విశిష్టత ఉన్నట్లే దావణగెరెకు వెన్ననగరిగా పేరొంది. దావణగెరె బెణ్ణె దోసె (వెన్న దోసె) దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. వ్యవసాయ, పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన దావణగెరెలో రెండు ప్రధాన కుటుంబాల మధ్య పోటీ సాగుతోంది. శామనూరు, భీమనూరు కుటుంబాల నడుమ లోక్‌సభ బరిలో ఇద్దరు మహిళలు పోటీలో ఉన్నారు. దావణగెరె లోక్‌సభ చరిత్రలోనే తొలిసారిగా రెండు జాతీయ పార్టీలనుంచి మహిళలు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, అఖిల భారత వీరశైవ మహాసభ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శామనూరు శివశంకరప్ప కోడలు, రాష్ట్ర ఉద్యానవన శాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున భార్య డాక్టర్ ప్రభ పోటీ చేస్తున్నారు. ఎస్ఎస్ కేర్ ట్రస్టు ద్వారా ఆరోగ్యరంగంలో నిరంతరంగా సేవలు కొనసాగిస్తున్నారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ జీఎం సిద్దేశ్వర్ భార్య గాయత్రి బరిలో ఉన్నారు. సిద్దేశ్వర్ కేంద్రమంత్రిగా వ్యవహరించారు.

● 1977లో దావణగెరె లోక్‌సభ స్థానం ఏర్పడగా 12సార్లు ఎన్నికలు జరిగాయి. 6సార్లు కాంగ్రెస్, 6సార్లు బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపొందితే వారే అత్యధికసార్లు గెలిచినట్లు అవుతుంది. 1999 నుంచి వరుసగా ఐదుసార్లు బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. ప్రస్తుతం రాష్ట్రమంత్రిగా వ్యవహరిస్తున్న ఎస్ఎస్ మల్లికార్జున లోక్‌సభ ఎన్నికల్లో మూడుసార్లు ఓడిపోయారు. దావణగెరెలో 8,40,340మంది మహిళా ఓటర్లు కాగా 8,38,705మంది పురుషులు, 136మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. మొత్తం ఓటర్లు 16,79,181మంది ఉన్నారు.

వెంటాడుతున్న రెబెల్స్ భయం

దావణగెరె స్థానం నుంచి 30మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రముఖంగా కాంగ్రెస్ టిక్కెట్ కోసం ప్రయత్నించి విఫలమైన జీవీ వినయ్‌కుమార్ పోటీ



గాయత్రి సిద్దేశ్వర్

చేయడంతో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వినయ్‌కుమార్‌తో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గ్రామంలోనూ వందలమంది ఉండడం అభ్యర్థి ప్రభా మల్లికార్జున్‌కు తలనొప్పిగా మారింది. మరోవైపు ఇండిపెండెంట్‌లలో ఏకంగా 12మంది ముస్లిం అభ్యర్థులు ఉన్నారు. వీరు పొందే ఓటర్లు కాంగ్రెస్‌కు మైనస్ కానున్నాయి. ఎస్ఏ రవీంద్రనాథ్, కరుణాకరరెడ్డి, ఎంపీ రేణుకాచార్య, మాజీ ఎమ్మెల్యే మాడాల్ విరూపాక్షప్ప, బసవరాజనాయకలు గ్రూప్ రాజకీయాలు కొనసాగిస్తుండడంతో బీజేపీ అభ్యర్థికి ఆందోళన మొదలైంది.

దావణగెరె పరిధిలో 8 ఎమ్మెల్యే స్థానాలు ఉండగా దావణగెరె ఉత్తర (కాంగ్రెస్), దావణగెరె దక్షిణ (కాంగ్రెస్), మాయకొండ (కాంగ్రెస్), జగలూరు (కాంగ్రెస్), హొన్నాళి (కాంగ్రెస్), హరపనహళ్ళి (కాంగ్రెస్), హరిహర (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. 8మందిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడం వారికి కలిసి వస్తుందని భావిస్తున్నారు.

● బీజేపీ అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్‌కు ప్రధాని మోదీ చరిష్మాతో పాటు బీజేపీకి కంచుకోట కావడం, భర్త సిద్దేశ్వర్ వరుసగా నాలుగుసార్లు ఎంపీగా గెలుపొందారు. కొంతకాలం కేంద్ర మంత్రిగాను వ్యవహరించారు. మామ రెండుసార్లు, భర్త నాలుగుసార్లు ఎంపీగా కొనసాగగా ప్రస్తుతం భార్యకు టిక్కెట్ ఇవ్వడంపై వారసత్వ రాజకీయమనే ముద్రపడింది. బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వ్యతిరేకంగా ఉన్నారు. సిద్దేశ్వర్ 20ఏళ్లుగా ఎంపీగా ఉన్నా దావణగెరెకు విమానాశ్రయం సాధించడంలో విఫలమయ్యారు. పారిశ్రామికవాడ ఏర్పాటులోనూ ప్రగతి సాధించలేకపోయారు. పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు పార్టీని వీడడం ఆందోళనగా మారింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ప్రభా మల్లికార్జున్‌కు రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు కలసి వస్తున్నాయి. 8మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు కాంగ్రెస్‌కు చెందినవారు కావడం, విద్యావేత్త, డాక్టర్‌గానే కాకుండా ప్రజల ఆరోగ్యంపట్ల ఉచిత వైద్యసేవలు కొసాగించడం కలసి వస్తోంది. ఇక మైనస్‌లలో భర్త మంత్రి, మామ ఎమ్మెల్యే, ఎంపీ కూడా వారి కుటుంబానికేనా అనే ఆరోపణలు ఉన్నాయి. రెబెల్ అభ్యర్థి వినయ్‌కుమార్ పోటీలో ఉండడం, 12మంది ముస్లింలు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం కొంత మైనస్‌గా చెప్పవచ్చు.



ప్రభా మల్లికార్జున్

కార్మికులే ప్రపంచ ఆస్తి



మేడే ఆచరణలో ప్రధాన సివిల్ న్యాయాధికారి కేశవమూర్తి తదితరులు

బంగారపేట, మే 1: ఏదేశ ప్రగతి అయినా అక్కడి కార్మిక వనరులపైనే ఆధారపడి ఉంటుందని కార్మికులు ప్రపంచ ఆస్తి అని, కార్మికులు లేని జగత్తును ఊహించడం సాధ్యం కాదని ప్రధాన సివిల్ న్యాయాధికారి బీ కేశవ మూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ సభాంగణంలో రీచ్ సంస్థ, ఫోకస్ సంస్థ, తాలూకా న్యాయసేవల ప్రాధికార, న్యాయవాదుల సంఘం, కార్మిక సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మేడేను ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల సేవలను గుర్తించేలా 'మే డే' ఆచరిస్తుండడం అభినందనీయమన్నారు. కార్మికుల రక్షణకోసం పలు చట్టాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికులలో చట్టాలపై అవగాహన లేక పోవడంతో పెట్టుబడిదారులకు లాభంగా మారిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టికల్ 14, 15లలో సమాన పనికి సమాన వేతనం అని పేర్కొంటున్నాయన్నారు. శారీరక సామర్థ్యం, నైపుణ్యం ఉన్నవారు, లేనివారు ఇలా వారి అర్హతకు తగిన విధంగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుందని, అయితే లింగ బేధం చూపరాదన్నారు. రాజ్యాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ బాలకార్మిక పద్ధతిని ప్రోత్సహించదన్నారు. 14ఏళ్లలోపువారిని పనులలోకి పెట్టరాదన్నారు. ఆర్టికల్ 24న ప్రకారం దండన తప్పదన్నారు. కార్మికుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని వాటిపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సై భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఏదైనా ఒక సంస్థ లేదా ఫ్యాక్టరీలలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లు జనస్నేహిగా విధులు నిర్వహిస్తున్నాయన్నారు. మీ ఫిర్యాదులపై స్పందించి న్యాయం కల్పించేందుకు ప్రామాణిక ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణప్ప, అ.నా.హరీశ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ రథోత్సవం



రాధాకృష్ణుల రథోత్సవం ఇలా...

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ వార్షిక ఉత్సవాల్లో బ్రహ్మరథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రాధాకృష్ణులకు విశేషపూజలు నిర్వహించి ఊరేగించారు. శ్రీకృష్ణ, బలరాముడు, నితాయ్ గౌరంగ్ విగ్రహాలను కూడా ఊరేగించారు. హరేకృష్ణ కొండపై ఉన్న ఇస్కాన్ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి 108 రకాల విశేష నైవేద్యాలను సమర్పించారు. ఏప్రిల్ 21న ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం రథోత్సవం జరిగింది. 2న గురువారం కుంభాభిషేకం, 3న ధ్వజ అవరోహణతో ముగియనున్నాయి. ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షుడు మధుపండిత్‌దాస్ మాట్లాడుతూ ఇస్కాన్ బెంగళూరు వార్షిక బ్రహ్మోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణ గురూజీకి విశేషపూజలు

బొమ్మనహళ్ళి, మే 1: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సంఘ సంస్కర్త నారాయణ గురూజీ ఐదు అడుగుల పంచలోహ విగ్రహాన్ని నగరంలో పలు చోట్ల ఊరేగించి విశేషపూజలు నిర్వహించారు. కేరళ నుంచి వచ్చిన నారాయణ గురూజీ విగ్రహాన్ని నగరంలో పలు చోట్ల ఊరేగించి విశేషపూజలు చేశారు. శ్రీ నారాయణ గురూజీ ధర్మపరిపాలన (ఎస్ఎన్‌డీపీ) సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు కొనసాగించింది. ఎలక్ట్రానిక్ సిటీ, జిగణి, బొమ్మనహళ్లి, హొంగసంద్ర, యశ్వంతపుర తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. కాగా ఈనెల 5న జాలహళ్ళి ప్రాంతం తమ్మనహళ్ళిలో ఈనెల ప్రతిష్ఠాపన జరగనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎన్‌డీపీ శాఖలు, భక్తులు కల్గిన ప్రాంతాల్లో గురూజీ విగ్రహాన్ని ఊరేగిస్తున్నారు.



నారాయణ గురూజీ పంచలోహ విగ్రహం ఊరేగింపు

గ్రామ దేవతల ఉత్సవం

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆవలహళ్ళిలో గ్రామ దేవతలు మారమ్మదేవి, దొడ్డమ్మదేవి, కెంపమ్మదేవిల ఉత్సవం ఘనంగా జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ లక్ష్మినారాయణ నేతృత్వం వహించారు. ప్రత్యేకించి కరువు పరిస్థితులు తొలగి చక్కగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్టు ఆయన తెలిపారు. ఉత్సవంలో బ్యాంక్ చంద్రప్ప, ఆర్ చంద్రప్ప, ధర్మపాల్, హనుమంతరెడ్డి, గిరీశ్, రమేశ్, ట్రస్టు పదాధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనిషి ఎంతగా కృషి చేసినా దైవ కృప లేనిదే సాధన, విజయం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఆవలహళ్ళి గ్రామజాతరకు 300 ఏళ్లకుపైగా చరిత్ర ఉందన్నారు. జాతరలో భాగంగా బుధవారం అగ్నిగుండం ఏర్పాటు చేయగా పలువురు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. కళశాలతో, దీపాలతో అమ్మవారిని స్వాగతించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.



అగ్నిగుండంపై నడుస్తున్న భక్తులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు..ఒకరి మృతి

చింతామణి, మే 1: చింతామణి పట్టణ, గ్రామీణ ప్రదేశాల్లో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు పట్టణలోని చేళూరు రోడ్డు కిసాన్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ సమీపాన లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ చోదకుడు సింగసంద్రకు చెందిన సుధాకరరెడ్డి (22)కి తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రాత్రి 9 గంటలకు జాతీయ రహదారి 234పై చింతామణి - శ్రీనివాసపుర రోడ్డుపై గోపసంద్ర సమీపాన మారుతి షోరూం సమీపాన బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శిడ్లఘట్ట పట్టణానికి చెందిన 30ఏళ్ళ షరీఫ్, 35ఏళ్ల ఫైరోజ్ గాయపడ్డారు. శిడ్లఘట్ట నుంచి చింతామణి మార్గంలో సరిహద్దులోని మదనపల్లికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పింది. షరీఫ్‌కు తీవ్ర గాయాలు కాగా ఫైరోజ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన షరీఫ్‌ను మెరుగైన చికిత్సకోసం కోలారు ఆసుపత్రికి తరలించారు. ఇక మరో ఘటనలో చింతామణి - బెంగళూరు రహదారిపై కటమాచనహళ్ళి సమీపాన ఆటో అదుపు తప్పి రోడ్డుపక్కన గుంతలో పడిపోయింది. ఆటో డ్రైవర్, అతడి భార్య, పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్లారు. కాగా గాయపడిన కటమాచనహళ్ళి గ్రామస్థుల వివరాలు తెలియరాలేదు. మంగళవారం చోటు చేసుకున్న మూడు ప్రమాదాలపై పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

డాక్టర్ విజయలక్ష్మికి మ్యూజిక్ థెరపీ అవార్డు



అవార్డుతో విజయలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మీరా సెంటర్ ఫర్ మ్యూజిక్ థెరపీ, మనోల్లాసిని ట్రస్టు సంయుక్తంగా ఏడాదికోసారి సంగీత సాధకులకు అందించే మ్యూజిక్ థెరపీ అవార్డును డాక్టర్ విజయలక్ష్మి సుబ్రమణియన్‌కు ప్రదానం చేశారు. భారతీయ విద్యాభవన్‌లో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి కుమార్, సంగీత విదూషి ఆర్ఏ రమామణి, ఇండో ఏషియన్ అకాడమీ సంస్థల చైర్మన్ ఏకాంబరం నాయుడు, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ హెచ్ఎస్ సురేశ్, ట్రస్టీలు డాక్టర్ మీనాక్షి రవి, ఎన్‌జీ రవి, కళ్ళె వెంకటేశ్వరశాస్త్రి పాల్గొన్నారు. ఆటిజంను ఎదుర్కొంటున్న చిన్నారులకు శ్లోకాలు, పాటలు, పద్యాలు, సంగీతం నేర్పేందుకు మనోల్లాసిని ట్రస్టు ఏర్పడిందని ఏటా డాక్టర్ పరమేశ్వర్ మెమోరియల్ మ్యూజిక్ థెరపీ అవార్డును ప్రదానం చేస్తున్నామన్నారు. ఇదే సందర్భంగా డాక్టర్ మీనాక్షి రవి రచించిన భక్తలహరి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వినూత్నంగా కార్మిక దినోత్సవం



ఫ్రీడం పార్కులో వివిధ కార్మిక సంఘాల నాయకులు

జాలహళ్ళి, మే 1: నగరంలోని ఫ్రీడం పార్క్‌లో మేడేను వినూత్నంగా నిర్వహించారు. కార్మికుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం కార్మిక సంఘాలు జరిపారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ బాబు మాథ్యూ ప్రసంగిస్తూ 1886 మే 4న అమెరికా దేశం చికాగోలో కార్మికులు జరిపిన ప్రదర్శనలో అప్పటి సామ్రాజ్యవాద దేశాలులు జరిపిన కాల్పుల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అనంతరం కొంత కాలానికి మే 1న విశ్వకార్మిక దినోత్సవం ఆచరిస్తున్నారన్నారు. 8 గంటల పని ఉండాలని పోరాటం చేస్తుంటే కేంద్రప్రభుత్వం 12గంటలపాటు కార్మికుల చేత పని చేయించుకోవచ్చునని వివిధ రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందన్నారు. దేశంలో 45కోట్లమంది కార్మికులు కనీస వేతనానికి నోచుకోవడం లేదన్నారు. కొత్తగా వచ్చిన కార్మికుల చట్టం ప్రకారం 300మందికంటే తక్కువ ఉన్న ఫ్యాక్టరీలలో కార్మికులకు నోటీసులు ఇవ్వకుండానే తొలగించే అవకాశం ఉందన్నారు. ఇది కార్మికుల ఉద్యోగభద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ప్రస్తుత కార్మిక చట్టాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జేసీటీయూ నాయకులు మరిలింగయ్య, ఎం దీపక్, సీఐటీయూ నాయకులు ఉమేశ్, ఎం భట్, మహిళా నాయకులు జయమ్మ, నిర్మల, ఏఐయూటీసీసీ నాయకుడు అప్పన్న తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ఏఐవైఎఫ్ సంస్థాపక దినోత్సవం, రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తుల సందడి


చింతామణి, మే 1: తాలూకాలోని కైవార హోబళి అట్టూరు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి బ్రహ్మరథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రెండు రోజుల జాతరలో పురాణ ప్రసిద్ధమైన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం స్వామివారికి విశేషపూజల అనంతరం మంగళవాయిద్యాల నడుమ అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. వేదఘోషలు, భక్తుల హర్షధ్వానాల నడుమ రథోత్సవం సాగింది. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పానకం, మజ్జిగ, పెసరబేడలు పంపిణీ చేశారు. డప్పు బృందాలు, కోలాటం, భజన బృందాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు రథోత్సవానికి మరింత శోభనిచ్చాయి. జాతరలో పలు రకాల తినుబండారాలు, ఆట సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులు ఉత్సాహంగా కొనుగోళ్ల చేశారు.

96 శాతం మంది అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు


● రాష్ట్రంలో ప్రత్యేక నియోజకవర్గ కేంద్రంగా గుల్బర్గా ● దరిదాపుల్లోకి కూడా చేరుకోలేని స్వతంత్రులు

బళ్లారి గాంధీనగర్, మే 1: ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా గెలుపు, ఓటములు తరువాత ఎంతమంది డిపాజిట్లు, కోల్పోయారు... ఎంతమంది డిపాజిట్లు దక్కించుకున్నారన్నదే రెండో ప్రధాన అంశంగా చర్చకు వస్తుంది. ఇందులో ప్రధానంగా గుల్బర్గా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 1951 నుండి 2019 వరకు జరిగిన ఎన్నికల్లో విజయం కేవలం రాజకీయ పార్టీలకు మాత్రమే దక్కిందే మినహా... ఎక్కడా స్వతంత్ర అభ్యర్థులు విజయం దరిదాపులకు కూడా వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఈ అవధిలో ఉప ఎన్నికలు చేరి మొత్తం 19 ఎన్నికలు జరిగాయి. ఇందులో 146మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో 20మంది అభ్యర్థులు, 23మంది ఓటమి పాలైన అభ్యర్థులు మాత్రమే డిపాజిట్లు దక్కించుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులతో చేరి మొత్తం 103మంది అభ్యర్థులు నామినేషన్ డిజిపాట్లు పోగొట్టుకున్న వారే ఎక్కువ. 1951 నాటి నుండి గుల్బర్గా ఎన్నికల్లో పోటీచేసిన కాంగ్రెస్ కొంతమంచీట అభ్యర్థులు గెలుపు సాధించక పోయినా... డిపాజిట్లు దక్కించుకోవడంలో ఎక్కడా విఫలం కాలేదు. 1991 నుండి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులు ఓడినా డిపాజిట్లు కాపాడుకుంటూ రావం విశేషం. డిపాజిట్లు కోల్పోయిన 103మంది అభ్యర్థుల్లో 56మంది స్వతంత్ర అభ్యర్థులు 47మంది ఇతర పార్టీలకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన 58 స్వతంత్ర అభ్యర్థుల పైకి 1951 ఎన్నికల్లో శరణగౌడ 39,041 ఓట్లు పొంది 36.78 శాతం ఓట్లు పొందారు) 1957లో జరిగిన ఎన్నికల్లో





శరణగౌడ సిద్రామయ్య (1,09,124లో20.55) మాత్రమే డిపాజిట్లు దక్కించుకోగా, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసిన 96.55 మందికి డిపాజిట్లు కోల్పోవాల్సి వచ్చింది. . భారత ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి డిపాజిట్లు కాపాడుకోవాలంటే ఆ నియోజకవర్గంలో పోలింగ్ అయిన ఓట్లలో 6వ వంతు పొందాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక లక్ష మంది ఓటు వేస్తే అందులో 16,666 ఓట్లు పొందితేనే డిపాజిట్లు పొందడానికి సాధ్యమవుతుంది. అందులో విఫలమైతే అభ్యర్థులు చెల్లించిన డిపాజిట్లు పోగొట్టుకోవాల్సిందే. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలో ప్రతి సామాన్య వర్గానికి చెందిన అభ్యర్థి రూ 25వేలు నామినేషన్‌తో పాటు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ 12,500లు డిపాజిట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్నికల్లో 14మంది గుల్బర్గా లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండగా, ఈ నియోజకవర్గంలో ఎంతమంది అభ్యర్థులు డిపాజిట్లు మిగిల్చుకుంటారో జూన్ 4వ తరువాత తెలుస్తుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.07	1,575.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	266	220
సామర్థ్యం (టీఎంసీలు)	3.60	2.76

గడినాడులో రాజకీయ ఘర్షణ

- ఎంపీ అభ్యర్థుల గెలుపునకు బీజేపీ, కాంగ్రెస్ విశ్వప్రయత్నం
- రాజకీయ భిక్షపెట్టమంటున్న బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు
- అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని తుకారాం విజ్ఞప్తి



ఓట్ల వేటలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

బళ్లారి, మే 1(ఆంధ్రజ్యోతి): గడినాడు ప్రాంతంలో భాగమైన బళ్లారి జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. బీజేపీ అభ్యర్థి శ్రీరాములు ప్రచారంలో ముందంజలో ఉండడగా గత రెండు రోజుల నుండి కాంగ్రెస్ ప్రచార రథం కూడా పరుగులు పెడుతోంది. రెండుమూడు రోజుల క్రితం వరకు కాంగ్రెస్ పెద్దగా ప్రచారం చేయకుండా ఉండేది. అయితే ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకున్న సీఎం పనిచేయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మందలించడంతో వారు ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, మంత్రి నాగేంద్ర, కంప్లి ఎమ్మెల్యే గణేష్, విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప, కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాసులు పనితీరుపై కాంగ్రెస్ పెద్దలు ఇంటలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం రాబట్టుకున్నారని తెలిసింది. ఇది పార్టీకి ప్రతిష్టాత్మకం అందరూ కలిసి పనిచేయండి అని సీఎం, డీసీఎంలు గట్టిగా హెచ్చరించారని తెలిసింది. దీంతో గత రెండుమూడురోజులుగా కాంగ్రెస్ ప్రచారం పుంజుకుంది. ఎంపీ అభ్యర్థి తుకారాంతో పాటుకాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీ పథకాలపై ప్రచారం చేస్తూ తిరిగి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు.



ప్రచారంలో మంత్రి నాగేంద్ర, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్



ప్రచారంలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

ఇప్పటికే ఒకరౌండ్ పూర్తి చేసిన శ్రీరాములు

ఇక బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు కూడా గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం ఎమ్మెల్యేగా ఉన్నాడని, తాను ఏపదవిలోనూ లేనని, కనుక తనకు ఓటు వేయాలని కోరుతున్నాడు. అందరికీ అందుబాటులో ఉంటానని చెబుతున్నారు. పైగా మోదీ లాంటి వ్యక్తి దేశానికి చాలా అవసరమని, కనుక బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాడు. శ్రీరాములు ముందు నుండి ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఇప్పటికే ఎంపీ లోక్‌సభ పరిధిలోకి వచ్చే 8 నియోజకవర్గాల్లో బాగా పర్యటించి ప్రచారం చేశారు. పైగా ఆయన గెలుపుకు బీజేపీలో ఉండే కీలక నేతలు కూడా ప్రయత్నిస్తున్నారు. అంతకు మించి గాలి జనార్దన్‌రెడ్డి బీజేపీలో చేరడం, ఆయన భార్యలక్ష్మిఅరుణ, గాలి సోమశేఖర్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు బీజేపీ గెలుపుకు కృషి చేస్తున్నారు. కాగా బీజేపీ అభ్యర్థి శ్రీరాములు రాజకీయ భవిష్యత్తు తేల్చే ఎన్నికలు ఇవి. ఇప్పటికే ఆయన ఎమ్మెల్యేగా ఓడిపోయి అంతర్మథనంలో పడిపోయాడు. ఈ ఎన్నికల్లోనూ ఓడిపోతే ఎలా అనే బాధను ఆయన స్వయానా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం బీజేపీ ఈ పదేళ్లలో ఏమి చేసిందని ప్రశ్నిస్తూ ప్రచారం చేస్తుంటే.. బీజేపీ మాత్రం మోదీ దేశానికి అనేక అభివృద్ధి పనులు చేశారని ప్రచారం చేస్తోంది. మొత్తం మీద బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలూ గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి.

కొత్త బాంబు పేల్చిన 'గాలి'

శాసనసభ ఎన్నికల్లో సిద్దరామయ్య తనతో ఒప్పందం కుదుర్చుకున్నారని వెల్లడి

బళ్లారి గాంధీనగర్, మే 1: ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో గాలి జనార్దన్ రెడ్డి కొత్తబాంబు పేల్చారు. శాసనసభ ఎన్నికల్లో సిద్దరామయ్య తనతో ఒప్పందం కుదుర్చుకున్నారని గాలి జనార్దన్ రెడ్డి వెల్లడించడంతో రాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. గాలి జనార్దన్ రెడ్డి బీజేపీలో చేరిన తరువాత పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొప్పళ లోక్‌సభ అభ్యర్థి తరఫున బుధవారం గంగావతి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో ఈ కొత్తబాంబు పేల్చడంతో రాష్ట్ర రాజకీయాలు కొప్పళవైపు మళ్లాయి. గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో సిద్దరామయ్య తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని తనవద్దకు పంపారని, పాత వైషమ్యాలను మరిచిపోవాలని, గంగావతిలో ప్రచారానికి రానని, రెడ్డి గురించి ఎక్కడా తాను ఎక్కడా మాట్లాడడని చెప్పి పంపారన్నారు. అనుకున్నట్లుగా సిదరామయ్య గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో గంగావతి, బళ్లారికి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు రెడ్డి సహకారం అవుతుందని అప్పట్లో సిద్దూ భావించి ఉండవచ్చు. ఈ నెల 30వ తేదీన కాంగ్రెస్ ప్రచారం కార్యక్రమంలో మాజీ మంత్రి ఇక్బాల్ అన్సారి తన ఓటమికి కాంగ్రెస్ సీనియర్ నాయకులే కారణమని చెప్పడం... ప్రస్తుతం జనార్దన్ రెడ్డి సిద్దరామయ్య తనతో ఒప్పందం కుదుర్చు కున్నారని చెప్పడం చూస్తుంటే... ఏం జరిగిందో చెప్పకచెప్పినట్లయింది.

కార్మికులకు సన్మానం



మాళవి వద్ద కూలీలను సన్మానిస్తున్న అధికారులు

కంప్లి, మే 1: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాళవి జలాశయంలో కూలింగ్ నిర్వహిస్తున్న కార్మికులను అధికారులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అధికారి కొట్రమ్మ మాట్లాడుతూ కూలీ కార్మికులు మే 1న గుర్తుంచుకోవాల్సిన రోజన్నారు. సంవత్సరం పాటు పని చేసే కూలీ కార్మికులకు మే 1 ప్రత్యేక గుర్తింపునిస్తుందని తెలిపారు. తాలుకా, పంచాయతీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి



స్వీప్ కమిటీ ఓటు హక్కు ర్యాలీని ప్రారంభించిన ఈవో

కంప్లి, మే 1 : రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని స్వీప్ కమిటీ అధ్యక్షులు శ్రీకుమార్ తెలిపారు. కణివి తిమ్మలాపురం చెరువులో ఉపాధి కూలీల వద్ద వారికి అవగాహన కల్పించి వారి ఓటు నమూనాను చేపట్టి అవగాహన కల్పించారు. అలాగే సండూరు తాలుకా స్వీప్ కమిటీ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తాలుకా ఈవో షడక్షరయ్య ఒరటు విజయ్ సర్కిల్‌లో ఓటు హక్కుపై ర్యాలీ చేపట్టారు. 7వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

పతంజలి ఆధ్వర్యంలో ఓటరు జాతా

బళ్లారి సిటీ, మే 1: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేయడం పవిత్రమైన కర్తవ్యమని, దానిని తప్పనిసరి చేస్తూ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని పతంజలి యోగాసమితి రాష్ట్ర ఇన్‌ఛార్జి యోగాచార్య భవర్‌లాల్ ఆర్య అన్నారు. బుధవారం ఉదయం హొసపేటలో పతంజలి యోగా కమిటీ, జిల్లా స్వీప్‌కమిటీ సహకారంతో నిర్వహించిన ప్రత్యేక యోగా శిబిరం, ఓటరు అవగాహన జాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంచి వ్యవస్థ నిర్మాణానికి ఓటు వేయడం నాంది అవుతుందన్నారు. చాలా మంది మేధావులు, విద్యావంతులు ఓటు వేయడానికి దూరంగా ఉండటం విడ్డూరమన్నారు. మంచి దేశాన్ని నిర్మించాలంటే ఓటు చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ అధికారి చంద్రప్ప మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, ఆలోచనలు ఫలవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమన్నారు.

ప్రజ్వల్ కేసును సీబీఐకి అప్పగించాలి



కనకదాసు విగ్రహానికి పూలమాల వేస్తున్న బైరతి బసవరాజ్, శ్రీరాములు తదితరులు

బళ్లారి సిటీ, మే 1: ప్రజ్వల్ రేవణ్ణ ప్రమేయం ఉన్నట్లు చెబుతున్న లైంగికదాడి కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ అన్నారు. హొసపేటలో బుధవారం బళ్లారి లోక్ సభ అభ్యర్థి శ్రీరాములు, నాయకులు చెన్నబసనగౌడ పాటిల్, సిద్దార్థసింగ్, దమ్మూరుశేఖర్, అయ్యాలి తిమ్మప్ప తదితరులు రైల్వే స్టేషన్ రోడ్డులోని కనకదాసు విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైరతి బసవరాజ్ మాట్లాడారు. ప్రజ్వల కేసు ఎన్నికలపై ఎటువంటి ప్రభావం చూపదన్నారు. మోదీకి బలం చేకూర్చాలని ఉత్తర కర్ణాటక ఓటర్లు ఇప్పటికే నిర్ణయించుకున్నారని, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని రక్షించే ప్రశ్నే లేదన్నారు. దీనిపై హోంమంత్రి స్పష్టత ఇచ్చారని తెలిపారు.

పోలింగ్ సిబ్బందికి / గాంధీభవన్‌లో ఓటింగ్ ప్రారంభం

బళ్లారి సిటీ, మే 1: బళ్లారి లోక్‌సభ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు నగరంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని గాంధీభవన్‌లో ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల డ్యూటీ కారణంగా మే 7వ తేదీ పోలింగ్ రోజున ఓటు వేయలేని వారి కోసం బుధవారం ఓటింగ్ జరిపారు. మే 1నుంచి 6వతేది వరకు వారు ఓటు వేసేందుకు వీలుగా సిటీ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని గాంధీభవన్‌లో పోస్టల్ ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పెసిలిటేషన్ సెంటర్‌కు జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది క్యూలో నిలబడి ఓటు వేశారు. కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ గాంధీభవన్‌లోని పోస్టల్ ఓటింగ్ కేంద్రాన్ని సందర్శించారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వివిధ శాఖల అధికారులు

తెలుగువారితో కాలవ శ్రీనివాసులు ఆత్మీయ సమావేశం

బళ్లారి మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం తెలుగు వారు ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, తరలి వచ్చి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించాలని మాజీ మంత్రి, అనంతపురం జిల్లా రాయదుర్గం తెలుగు దేశం కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.



టీడీపీ కూటమి రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

ఆయన గురువారం రాత్రి బళ్ళారిలోని తెలుగు వారితో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. బళ్ళారి జిల్లా కమ్మ సంఘం అధ్యక్షులు ముండ్లూరు అనూప్ కుమార్ కాలవను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ ప్రశాంతంగా ఉండాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో తెలుగు వారందరూ వచ్చి ఓటు వేయడంతో పాటు పూర్తి మద్దతు తెలుపుతూ తెలిసిన వారితో కూడా ఓట్లు వేయించాలని ఆయన కోరారు. గతంలో తెలుగు దేశం అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేసినపుడు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తెలుగు దేశం కూటమి అధికారంలోకి రావడంతో పాటు రాయదుర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన తక్షణమే రాయదుర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా మార్చుచేస్తానన్నారు. జగన్ రాక్షస పాలనను అంతమొందించేందుకు జనం అంతా కలిసి కట్టుగా టిడిపి కూటమిని గెలపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బళ్ళారి కమ్మ సంఘం అధ్యక్షులు అనూప్ కుమార్, రాయదుర్గం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మెన్ చంద్రహాస్, కొత్తపల్లి తిమ్మరాజులు, హనుమంత రెడ్డి, బొమ్మనహాల్ మోహన్ దాస్, తిమ్మి ప్రకాష్, కోనంకి రవి, తదితరులు పాల్గొన్నారు.

కుడితినిలో నీటి కోసం హాహాకారాలు

కంప్లి, మే 1: కుడితిని పట్టణం 6వ వార్డులో గత రెండు, మూడునెలలుగా నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ కాలనీ మహిళలు గంగమ్మ, హంపమ్మ, ఉలిగమ్మ తెలిపారు. ఎన్నిసార్లు ఈ విషయంపైన అధికారులకు తెలిపినా తెలిసీతెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతినిత్యం తాము కూలీకి వెళితేనే తమ పొట్ట గడుస్తుందని అలాంటిది తాగునీటి కోసం కూలీ పనులు మానేసి ఇళ్లలో వేచి వుండాల్సిన పరిస్థితినెలకొందన్నారు. ఇళ్లల్లో ద్విచక్రవాహనాలు వున్న వారు మాత్రమే పక్క వార్డులకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారని, వృద్దులు, వికలాంగులు వున్న ఇళ్లల్లో నీటి సమస్యతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ధ్వంసమైన మోటారును రిపేరీ చేయించాలని అనసూయమ్మ, కొళగల్ మాలమ్మ, రామాలమ్మ తదితరులు కోరుతున్నారు.



బిందెలతో ప్రదర్శన చేస్తున్న స్థానిక మహిళలు

కమ్మసంఘం తొలి అధ్యక్షుడు రాజాశంకర్‌రావు మృతి



రాజా శంకర్ రావు (ఫైల్)

సిరుగుప్ప, మే 1: కమ్మసంఘం తొలి అధ్యక్షుడు రాజాశంకర్‌రావు (93) అనారోగ్యంతో మృతి చెందారు. సిరుగుప్ప తాలుకాలోని నందీపుర క్యాంపులో ఆయన బుధవారం మృతి చెందారు. ఆయన ఆంధ్ర ప్రదేశ్ కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలంలో జన్మించారు. 1961లో ఆంధ్ర నుంచి కర్ణాటకకు వలసవచ్చి వ్యవసాయం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. 1994లో కమ్మసంఘం భవనం తొలి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 17 యేళ్లపాటు ఆయన అధ్యక్షునిగా కొనసాగారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కమ్మసంఘం నిరుపేద విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లు, వివిధ సమాజ సేవలు అందించారు. ఆయన మృతి పట్ల కమ్మసంఘం గౌరవాధ్యక్షులు గొల్ల శ్రీనివాసరావు, కమ్మసంఘం ఫౌండర్ ఉమామహేశ్వరరావు, తాలుకా కమ్మసంఘం అధ్యక్షులు జూలాది రాధాకృష్ణ, మాజీ అధ్యక్షులు గోపాలకృష్ణ, రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం నందీపుర క్యాంపులో అంత్యక్రియలు జరగనున్నాయి.

శ్రీరాములు గెలుపు కోసం పొర్లు దండాలు



మారికాంబ దేవాలయంలో పొర్లుదండాలు పెడుతున్న నాగరాజు

కంప్లి, మే 1 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బి శ్రీరాములు గెలుపు కోసం కూడ్లిగి తాలుకా కురుహట్టి గ్రామానికి చెందిన నాగరాజు మారికాంబదేవి ఆలయం ఆవరణలో బుధవారం 101 పొర్లు దండాలు పెట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 2014లో కూడా గెలుపు కోసం మారికాంబదేవికి ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు. ఈ ఎన్నికల్లో కూడా రెండు లక్షల మెజార్టీతో గెలుపొందాలని అమ్మవారికి పూజలు చేపట్టామన్నారు. వారితో పాటు బీజేపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరొకసారి మోదీ ప్రభుత్వం రావాలి

గంగావతి రూరల్, మే 1 : దేశం అభివృద్ధి చెందాలంటే మరొకసారి మోదీ ప్రభుత్వం రావాలని మాజీ మంత్రి సిటీ రవి అన్నారు. గంగావతిలో బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో గత పది సంవత్సరాల నుంచి బీజేపీ ప్రభుత్వం పరిపాలన చేస్తూ ఎన్నో అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టిందన్నారు. ప్రధానమంత్రి మోదీ పథకాలను ప్రజలు దృష్టిలో పెట్టుకుని కొప్పళ లోక్ సభ అభ్యర్థి బసవరాజ్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు.

హోసూరు జోన్

మేడే సందర్భంగా రక్తదానం



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మేయర్ సత్య

హోసూరు, మే 1: రక్తదానం ప్రాణదానమని నిర్వాహకులు పేర్కొన్నారు. మేడే సందర్భంగా హోసూరులోని ఉదిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముల్లైనగర్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో 20వ వార్షిక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని హోసూరు మేయర్ సత్య ప్రారంభించి రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఆరోగ్యవంతులైన వారు మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. శిబిరంలో మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ ఉదిరం ఫౌండేషన్ మారియప్పన్, సత్యమూర్తి, స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు శంకరనారాయణన్, జాయింట్ సెక్రెటరీ మురుగన్, తూర్పు డీఎంకే కార్యదర్శి రాము, డీఎంకే కార్యనిర్వాహకులు భాస్కర్, వీరస్వామి, మోహన్‌కుమార్, అరుళ్‌కుమార్, ప్రభాకరన్, పొన్నువేల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే జెండా ఆవిష్కరణ

హోసూరు మే 1: హోసూరులో డీఎంకే తరఫున తమిళనాడు కన్స్యూమర్ గూడ్స్ ట్రేడ్ కార్పొరేషన్ గోదాము ముఖద్వారం వద్ద డీఎంకే జెండా అవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మున్సిపల్ డిప్యూటీ సెక్రటరీ, డీఎంకే కౌన్సిల్ సెక్రటరీ గోపాలకృష్ణన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ పాల్గొని జెండాను ఎగరవేశారు. డీఎంకే ఆశయాలు వివరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. నగర మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య ప్రత్యేక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసన్, ముఖ్య కార్యవర్గ సభ్యులు ఎల్లోరమణి, ధనలక్ష్మి, జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, నగర పాలకులు సెందిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కార్మిక సంఘాల ర్యాలీ

హోసూరు, మే 1: మే డేను పురస్కరించుకుని హోసూరు రాంనగర్‌లో సోషల్ లేబొరేటరీ కన్సాయ్ నెరోలాగ్ వర్కర్స్ యూనియన్‌ల సమన్వయంతో అశోక్ లైలాండ్ ఎంప్లాయిస్ యూనియన్ (యూనిట్-2) ఆధ్వర్యంలో 11 యూనియన్లు బుధవారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఆసియా టొబాకో యునైటెడ్ ఎంప్లాయీస్, జీఈ ఎంప్లాయీస్ యూనియన్ హోసూరు బాటా ఎంప్లాయీస్ యూనియన్, మైలాన్ లాబొరేటరీస్ వర్కర్స్ యూనియన్, మైక్రోల్యాబ్స్ ఎంఎల్- 01 లేబర్ అడ్వాన్స్ మెంట్ యూనియన్, పారాకోట్ ప్రొడక్ట్స్ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్, టెరెక్స్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మికుల ఐక్యత చాటారు.



హోసూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన

కాంగ్రెస్ పార్టీకి 20స్థానాలు ఖాయం

రాయచూరు, మే 1 : గత 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో అబద్దాలు మినహా అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి హెచ్ ఆంజనేయలు ఆరోపించారు. ఈక్రమంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పట్ల మరింత నమ్మకం ఏర్పడిందని ఈ సారి ఎన్నికల్లో రాష్ట్రంలోని 20 స్థానాల్లో తమ పార్టీ గెలవడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ మంత్రి మాట్లాడారు. గత 10 ఏళ్లలో నరేంద్ర మోదీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కేవలం అబద్ధాలు ప్రచారం చేయడంలోనే వారు నిమగ్నమైయ్యారన్నారు. 2024 లోకసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏఒక్క హామిని 10 ఏళ్ల పాలనలో అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వాస్తవానికి బీజేపీ అగ్రనేతలకే ఈ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని దీంతో పెద్ద ఎత్తున అబద్దాలకు తెర తీశారని ఆరోపించారు. ఇచ్చిన హామిలకు కట్టుబడి నిబద్ధతతో వాటిని అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో నమ్మకం మరింత పెరిగిందన్నారు. గడచిన 10 ఏళ్లలో ఎన్నడు లేని రీతిలో నిరుద్యోగం తీవ్రరూపం దాల్చగా రాజ్యాంగ సంస్థల విధ్వంసం యథేచ్చగా కొనసాగుతుండడాన్ని ప్రజలు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రజాస్వామిక విలువలకు, రాజ్యాంగ సంస్థలకు మధ్య జరుగుతున్న ఘర్షణ ఇప్పటి ఎన్నికలని ఆయన తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉన్నారని ఆంజనేయలు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ

జలాశయంలో పడి ఇద్దరు యువకుల దుర్మరణం

రాయచూరు, మే 1: జిల్లాలోని లింగసుగూరు తాలూకా బసవసాగర్ జలాశయం వద్ద బుధవారం బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృత్యువాతపడ్డారు. మృతులు ఇద్దరు లింగసుగూరు తాలూకాలోని బెండోణ గ్రామానికి చెందిన లక్ష్మణ్(22), బసవంత(25)లుగా గుర్తించారు. ఇద్దరు యువకులు బట్టలు ఉతుక్కునే క్రమంలో అందులో కాలు జారి పడిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వారిని రక్షించే ప్రయత్నం చేసేలోగానే ప్రాణాలు కోల్పోయారు. అనంతరం గ్రామస్థులు యువకులిద్దరి మృతదేహాలను బయటికి తీశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు